పంట బీమా.. రైతుల ధీమా

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో అవసరం. ఆధునిక వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు, రైతులకు రాయితీలు, ప్రోత్సాహకాలను అందించేందుకు నిర్దిష్టమైన ప్రణాళిక, కచ్చితమైన గణాంకాలు అవసరం. దీని కోసం ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఈ క్రాప్ నమోదు కార్యక్రమం చేపడుతోంది. దీంతో ప్రభుత్వపరంగా రైతులకు జరగాల్సిన అన్ని మేళ్లు సులువుగా జరిగే వెసులుబాటు ఉంది.

- అన్నదాతలకు అండగా ఈ–క్రాప్ ఈకేవైసీ
- ప్రకృతి విపత్తుల సమయంలో సాగు విస్తీర్ణంపై కచ్చితమైన సమాచారం
- నష్టపరిహారం చెల్లింపులోనూ ముఖ్య భూమిక
- నేటితో ముగియనున్న గడువు

మండలంలో వివిధ పంటల ఈ–క్రాప్ నమోదు వివరాల పట్టిక

మండలంలో మొత్తం పంటల సాగు విస్తీర్ణం (ఈ పంట నమోదు అయింది 6,809 ఎకరాలు. వరి సాగు విస్తీర్ణం (ఈ పంట నమోదు అయింది) 3,196 ఎకరాలు. ఇతర ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం (ఈ పంట నమోదు అయింది) 3,613 ఎకరాలు. వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు (ఈ పంట నమోదు చేసుకున్న రైతులు) 5,507 మంది. ఇప్పటి వరకూ ఈకేవైసీ పూర్తయిన విస్తీర్ణం 5,354 ఎకరాలు. ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతులు 4,080 మంది


ఈకేవైసీ నమోదు ఆవశ్యకతను రైతులకు వివరిస్తున్న ఏడీఏ రామారావు (ఫైల్)


బంగారమ్మపాలెంలో రైతులకు ఈకేవైసీ చేస్తున్న వ్యవసాయ సహాయకురాలు అపర్ణ

సబ్బవరం : రైతులు తాము పండించే పంటలను నమోదు చేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. ఈ–పంట నమోదు ద్వారా అన్నదాతల పంటలకు బీమా వర్తించడంతో పాటు వారు చెల్లించాల్సిన పంటల బీమా ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈ సీజన్‌కు సంబంధించి రైతులకు వరి ముఖ్యమైన పంట అయినప్పటికీ ఉద్యాన పంటలకు సంబంధించి జీడిమామిడి పంటకు కూడా బీమా వర్తిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం నుండి పెట్టుబడి సాయం పొందడానికి ఈ క్రాప్ నమోదు అనేది చాలా ముఖ్యం. వాతావరణ పరిస్థితులు అనుకూలించి, ఆశించిన వర్షాలు పడి మంచి దిగుబడులు సాధించిన రైతులు వారి పంటలను అమ్ముకోవడానికి ఈ పంట నమోదు అవసరం. సాగు ఉత్పత్తుల కొనుగోలు ప్రక్రియ చేపట్టేందుకు ఈ పంట నమోదు ప్రామాణికంగా తీసుకుని అంచనా వేస్తారు. ఈ కార్యక్రమాన్ని మూడంచెలుగా గ్రామ వ్యవసాయ సహాయకులు నిర్వహిస్తారు. ముందుగా పంట విస్తీర్ణం నమోదు చేస్తారు. అనంతరం సాగు చేస్తున్న పంటకు సంబంధించిన ఫొటోలు తీసి గ్రామ రెవెన్యూ అధికారులకు అందజేస్తారు. అనంతరం రైతులకు ఈకేవైసీ చేయడం ద్వారా ఈ ప్రక్రియ పూర్తవుతుంది.

ఈకేవైసీ పూర్తి చేశాం..



సుమారు 50 సెంట్ల భూమిలో వరి సాగు చేస్తున్నాను. వరి నాట్లు పూర్తయి కలుపు తీయడంతో పంట ఆరోగ్యంగా ఉంది. గతంలో వ్యవసాయ సహాయకులు ఈ–పంట నమోదు చేశారు. ఇప్పుడు కూడా ఈకేవైసీ పూర్తి చేశారు. రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెట్టుబడి సాయం చేస్తే బాగుంటుంది. గత ప్రభుత్వం రైతులను ప్రోత్సహించేందుకు పెట్టుబడి సాయంగా ఏటా రైతు భరోసా కింద రూ. 15 వేలు అందించింది.

– **చీపురుబల్లి సూర్యనారాయణ**, అమృతపురం గ్రామం, సబ్బవరం మండలం

పెట్టుబడి సాయం చేయాలి..



గ్రామంలో సుమారు 1.50 ఎకరాల్లో వరి పంట వేశాను. వరి నాట్లు పూర్తి కావడంతో కలుపు తీసాం. సుమారు రూ.16 వేల వరకూ పెట్టుబడి అయింది. ఈ–క్రాప్ నమోదులో భాగంగా ఈ–పంట నమోదు చేశారు. ప్రస్తుతం ఈకేవైసీ చేయాల్సి ఉంది. వ్యవసాయ ఉత్పత్తి అమ్ముకోవడానికి, ఇతర కార్యక్రమాల కోసం ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం చెబుతోంది. అలాగే రైతులకు పెట్టుబడి సాయం కూడా చేస్తే బాగుంటుంది.

– **పిల్లల స్వామినాయుడు**, రాయపుర అగ్రహారం, సబ్బవరం మండలం.

ఈకేవైసీ చివరి దశకు వచ్చింది..



మండలంలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు చేస్తున్న ఈ–పంట ఈకేవైసీ దాదాపు చివరి దశకు వచ్చింది. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలోని అన్ని గ్రామాల్లో 7,300 ఎకరాల్లో ఈ–పంట నమోదు జరిగింది. రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న గ్రామ వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులు ఈకేవైసీ చేస్తున్నారు. 28వ తేదీతో ఈకేవైసీ గడువు ముగుస్తుంది. మిగిలిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– **పోతల సత్యనారాయణ**, మండల వ్యవసాయ అధికారి, సబ్బవరం మండలం.

క్లుప్తంగా

తహసీల్దార్ ఆనంద్‌కుమార్ బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ ఆనంద్‌కుమార్

పెందుర్తి: మండల తహసీల్దార్‌గా ఎం.ఆనంద్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకంగా సేవలందిస్తామన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని చెప్పారు. అధికారులు, కార్యాలయ సిబ్బంది ఆనంద్‌కుమార్‌కు స్వాగతం పలికారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్‌గా సంతోష్ బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా పనిచేసిన వేణుగోపాల్ వీఎంఆర్‌డీఏకు బదిలీ అయిన సంగతి తెలిసిందే.

దసరా ఉత్సవాలకు పందిరి రాట


పందిరి రాట వేస్తున్న భక్తులు

పెందుర్తి : స్థానిక పాత ప్రభుత్వాస్పత్రి సమీపంలో దుర్గాదేవి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో దుర్గా నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం అంకురార్పణ చేశారు. శాస్త్రోక్తంగా పందిరి రాట వేశారు. ముందుగా అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన


గణపతి సన్నిధిలో గండి బాబ్జీ, రెడ్డి నారాయణరావు తదితరులు

పెందుర్తి : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా రాంపురం సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి సన్నిధిలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ప్రారంభించారు. దాదాపు 2 వేల మంది ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

నగరానికి ఈశాన్య ట్రైనీ పోలీసులు

విశాఖ సిటీ: నార్త్ ఈస్ట్ పోలీస్ అకాడమీ (నెపా) నుంచి 5 మంది ట్రైనీ డీఎస్పీలు, 10 మంది ట్రైనీ ఎస్సైలు అధ్యయన పర్యటన (భారత్ దర్శన్) నిమిత్తం విశాఖకు వచ్చారు. ఈ నెల 29వ తేదీ వరకు పోలీస్ విభాగానికి చెందిన పోలీస్ కంట్రోల్ రూమ్, 3వ పట్టణ పోలీస్‌స్టేషన్, ఫింగర్ ప్రింగ్ బ్యూరోతో పాటు నగరంలో పలు అధ్యయన కేంద్రాలు, చారిత్రాత్మక, పురావస్తు ప్రదేశాలను సందర్శించనున్నారు. శుక్రవారం వీరిని బీచ్ రోడ్డులో ఉన్న పోలీస్ ఆఫీసర్ మెస్‌లో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కలిశారు. వారితో సమావేశం నిర్వహించి పలు అనుభవాలను పంచుకున్నారు. మెళకువలను వివరించారు. దేశ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన విధులపై అవగాహన కల్పించారు.

డీటీ బాధ్యతల స్వీకరణ


పరవాడ డీటీ సురేష్ నాయుడు

పరవాడ: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా సురేష్‌నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కశింకోట డీటీగా పని చేసి, బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ డీటీగా పనిచేసిన శాంతిభూషణ్ అచ్యుతాపురం బదిలీ అయ్యారు. బి

- మండల సర్వేయర్‌గా కర్రి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన సబ్బవరం సర్వేయర్‌గా పని చేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

వీధి కాలువలు లేక ప్రజల అవస్థలు


వృథా నీరు పోవడానికి ఏర్పాటు లేని చేతి పంపు

పరవాడ: మండలంలో రావాడ శివారు గొల్లగుంట గ్రామంలో వీధి కాలువలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీధి కాలువల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టని కారణంగా వర్షపు నీరు, మురుగు నీరు ఇళ్ల మధ్య నుంచి ప్రవహించడంతో పాటు లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు నిలిచిపోయి దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం చేతి పంపు వద్ద వృథా నీరు పోవడానికి కూడా కాలువ నిర్మించలేదని వాపోయారు. దీంతో దుర్వాసన వెదజల్లుతుందన్నారు. ప్రభుత్వాలు మారినా గ్రామాభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందని తెలిపారు. అధికారులు స్పందించి గ్రామంలో కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి


ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న యాక్సెప్ట్ మైగ్రేట్స్ సంస్థ ప్రతినిధులు

పరవాడ: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని యాక్సెప్ట్ మైగ్రేట్స్ ప్రోగ్రాం మేనేజర్ బి.అనిల్‌కుమార్ అన్నారు. నోబుల్ టెక్నో సైన్స్ అండ్ ఎడ్యుకేషనల్ ఎంబీఏ కళాశాలలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాక్సెప్ట్ మైగ్రేట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాజాత నిర్వహించారు. యాక్సెప్ట్ మైగ్రేట్స్ సంస్థ ప్రతినిధులు కోదండ, వరప్రసాద్, లత, భాస్కర్, గీత, మోహన్, కుమారి, ఏఎస్ఎం ఆర్.కుమారి, డాక్టర్ విజయ్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు శ్రీకారం


రాట మహోత్సవంలో పాల్గొన్న గ్రామ పెద్దలు, స్థానికులు

పరవాడ: స్థానిక బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీదుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమ్మవారి రాట మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మవారి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. వేడుకలను గతం కంటే ఈ ఏడాది మరింత వైభవంగా నిర్వహించాలని యూత్ సభ్యులు చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బి.రామారావు, గ్రామ పెద్దలు రెడ్డి శ్రీనివాసరావు, చల్లా కనకారావు, విగ్రహ దాతలు రెడ్డి నరసింగరావు దంపతులు, వర్రి లక్ష్మి, పైల హరీష్, వెంకటరావు, అప్పలనాయుడు, సత్యవేణి, గండి ఈశ్వరరావు, పైల రామచంద్రారావు, పైల పోతినాయుడు, బొద్దపు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి


జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డులోని పలు సమస్యల పరిష్కారానికి సహకరించాలని కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు కోరారు. ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డులో 2018లో ప్రారంభమైన యూజీడీ పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయని అన్నారు. పురుషోత్తపురం సమీపంలో నేవీకి 100 ఎకరాల స్థలం కేటాయించారని.. వారు రక్షణ గోడ నిర్మించుకోవడంతో పురుషోత్తపురం, హౌసింగ్ బోర్డు కాలనీ, మరిడిమాంబ కాలనీ, బాలాజీనగర్, కృష్ణరాయపురం ప్రాంతాల నుంచి వచ్చే నీరు బయటికి వెళ్ళే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారానికి ఉన్నతాధికారులు కృషి చేయాలని విన్నవించారు. ఇతర సమస్యలను దేముడు ప్రస్తావించి వాటిని పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

ముంచెత్తిన వర్షపునీరు




రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పెందుర్తి పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పెందుర్తి కూడలి వద్ద వర్షపునీరు పోయేందుకు పూర్తిస్థాయి అవుట్‌లెట్ లేకపోవడం, డ్రైనేజీలు సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో నాలుగు రోడ్ల కూడలి మునిగిపోయింది. శుక్రవారం ఈ ప్రాంతంలో నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. ఆయా ప్రాంతంలోని దుకాణాలు కూడా మూతపడ్డాయి.

– పెందుర్తి

ఎరువులతో మెరుగైన సాగు ఉత్పత్తి

పరవాడ: వరి పంటలో యూరియా, పొటాషియం ఎరువులు వేసుకోవడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి మెరుగైన సాగు ఉత్పత్తి సాధ్యపడుతుందని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి తెలిపారు. ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఎరువులను వినియోగించని రైతాంగం ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు. 30 రోజుల తర్వాత వరి పొట్ట దశలో ఉన్నప్పుడు గింజ నాణ్యతను పెంపొందించుకోవడానికి మళ్లీ ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ పిచికారీ చేయాలన్నారు. నీటి మట్టానికి దగ్గరలో ఉన్న వరిలో పొడమచ్చలను గుర్తించి వాటి నివారణకు ఎకరానికి 400 మిల్లీలీటర్ల హెక్సాకొనజోల్ మందు పిచికారీ చేయడం ద్వారా ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ప్రస్తుతం వరిలో చాలా చోట్ల ఆకుముడత (తెల్లచిత్త) ఆశించినట్లు గమనించామని, నివారణకు ఎకరానికి 400 గ్రాముల కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ మందు వాడుకోవాలన్నారు. మందులు పిచికారీ చేసే సమయంలో పొలంలో నీరు పూర్తిగా తీసేయాలని, పొలం బాగా తడవాలని తెలిపారు. పొలం గట్లపై మందు పిచికారీ చేయడం వల్ల చీడపీడలను అదుపులో పెట్టవచ్చని వ్యవసాయాధికారి చంద్రావతి రైతులకు సూచించారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాతసేవ అనంతరం పంచామృతాభిషేకాలు చేశారు.

స్వచ్ఛతపై అవగాహన


మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెందుర్తి: 'స్వచ్ఛతా హీ సేవ–2024' కార్యక్రమంలో భాగంగా వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రాంపురంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యురాలు హిమబిందు, వెల్ఫేర్ కళాశాల ప్రతినిధి రమణరావు, పంచాయతీ కార్యదర్శి పైడిరాజు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ప్రసాద్, గ్రామంలోని పలువురు నాయకులు పాల్గొన్నారు.

జాగృతి సంస్థలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న దాతలు

సబ్బవరం : సబ్బవరంలోని జాగృతి సంస్థ వ్యవస్థాపకులు స్వర్గీయ కందర్ప రామకృష్ణ 59వ జయంతిని పురస్కరించుకుని సంస్థ కార్యాలయంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఇండియా బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమాన్ని జాగృతి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం మహత్తర కార్యక్రమం అన్నారు. రామకృష్ణ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. నేటి రక్తదాన శిబిరంలో 40 యూనిట్ల రక్తం సేకరించినట్లు తెలిపారు. సీఈవో కేఎల్ఎన్ మౌక్తిక, రెడ్‌క్రాస్ ఇండియా సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సమస్యల పరిష్కారానికి కృషి


పింఛన్‌దారుల సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వసంత

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలోని రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ శానాపతి వసంత అన్నారు. చిన ముషిడివాడలో నూతనంగా ఏర్పాటు చేసిన పింఛన్‌దారుల సంఘం కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘానికి శాశ్వత భవనం ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకుడు శానాపతి శంకర్రావు, సంఘం అధ్యక్షుడు అల్లం కృష్ణారావు, కార్యదర్శి కామరాజు, ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు, సహకార్యదర్శులు భాస్కరరావు, రామునాయుడు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ


బదిలీపై వెళ్తున్న అధికారులు, ఉద్యోగులను సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం : మండలానికి బదిలీపై వచ్చిన పలువురు అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్‌గా సీహెచ్ అప్పారావు, మండల పరిషత్ పరిపాలనాధికారిగా కె. శివప్రసాద్ నారాయణరావు, మండల సర్వేయర్‌గా ఎల్. అప్పారావు, తహసీల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్‌గా హరీష్ బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా వివిధ మండలాలకు బదిలీపై వెళ్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకట అప్పారావు, మండల సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు, టైపిస్టు వినయ్, ఆరుగురు గ్రామ సర్వేయర్లను జిల్లా వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, ఆర్ఐ వీరయ్య మిగిలిన సిబ్బందితో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామకాసు బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు పూడి శేషు, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

రెండు గంటల పాటు నిలిచిన ట్రాఫిక్

గుంతల్లో నిలిచిపోయిన వాహనాలు


పైడితల్లమ్మ గుడి సమీపంలో కర్రల డిపో వద్ద గుంతల్లో ఇరుక్కుపోయిన వాహనాలు

పరవాడ: పరవాడ–యలమంచిలి రహదారిలోని సినిమా హాలు కూడలిలో శుక్రవారం ఉదయం సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లపై గుంతల్లో నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఆ రహదారి మీదుగా ప్రయాణించే బొగ్గు లారీలు ఇక్కడ గుంతల్లో ఇరుక్కుపోవడం వలన వాహనాలు అర కిలోమీటరు పొడవునా నిలిచిపోయాయి. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో యలమంచిలి, గాజువాక వైపు రాకపోకలు సాగించే భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలతో పాటు కార్మికులు, ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. గుంతల్లో చిక్కుకుపోయిన వాహనాలను పక్కకు తొలగించడంతో ఎట్టకేలకు వాహనాలకు మార్గం సుగమమైంది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సినిమా హాలు కూడలిలో అధ్వానంగా ఉన్న రహదారి మరమ్మతుల కోసం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణబాబు కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో లలితకుమారి

పరవాడ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తుందని సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లలితకుమారి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా నాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని పోషకాహారం పొందాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పసుపు కుంకుమలు అందజేసి, సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.వరలక్ష్మి, ఎంపీటీసీ కూండ్రపు అక్కయ్యమ్మ, మాజీ ఎంపీటీసీ కె.శ్రీరామ్మూర్తి, నాయకులు కూండ్రపు మధు, కార్యదర్శి పోతల రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.